నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
ఆదివారం,27 అక్టోబర్ 2024 8 పేజీలు

## ప్రమాద వశాత్తు మృతి చెందిన భార్య,భర్త

- వెంటనే స్పందించిన మంత్రి పార్థ సారథి
- అంత్యక్రియలకు స్వంత సొమ్ము రూ.25వేలు అందజేత




**నూజివీడు,మేజర్‌న్యూస్:** నూజివీడు మండలము పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొండారామారావు, ప్రశాంతి దంపతులు తమ పశువులను నీటికోసం శనివారం చెరువులోకి దించారు. వాటి కోసం చెరువులోకి దిగి ప్రమాద వశాత్తు దంపతులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న

- తరువాయి 2లో..

## ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో
# ఆంధ్రాకు ప్రథమ స్థానం

- ఎగ్జిబిషన్‌ను తిలకించిన త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి




**ఉంగుటూరు,మేజర్‌న్యూస్ :** ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని త్రిపుర గవర్నర్ ఎం. ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో ఏర్పాటుచేసిన ఆక్వా ఎగ్జిబిషన్‌ను శనివారం త్రిపుర గవర్నర్ పరిశీలించి, స్థానిక మత్య రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆక్వా కల్చర్ అభివృద్ధికి మంచి అనువైన పరిస్థితులు ఉన్నాయన్నారు. త్రిపుర రాష్ట్రానికి కూడాఈ ప్రాంతం నుండి ప్రతీ రోజు 20లారీల వరకుఆక్వా ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలోని ఆక్వా రైతులను కలిసి ఆక్వాపరిశ్రమ అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులు,అధిక దిగుబడికి తీసుకుంటున్న చర్యలు, ఆక్వా రైతుల అనుభవాలను తెలుసుకున్నానన్నారు. ఈ ప్రాంతంలోని భూములు ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి ఎంతోఅనుకూలంగా ఉన్నాయన్నారు. త్రిపుర రాష్ట్ర ప్రభుత్వంఆక్వాపరిశ్రమను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నదని, ఇందుకోసం ప్రత్యేక చట్టాలు చేసిందన్నారు. త్రిపుర రాష్ట్రం చిన్న రాష్ట్రమని,కొండ ప్రాంతమని, అక్కడఎకరంలోపు భూములలో ఆక్వా చెరువులలో సాగుచేస్తుంటారని,వారి సంక్షేమాన్ని,వారి భద్రతకు త్రిపుర రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదన్నారు. త్రిపుర రాష్ట్రం ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా రూపుదిద్దుకుందని , విద్యా, వైద్య పరంగా ఉన్నతస్థానములో

- తరువాయి 2లో..

## కేంద్ర జలశక్తి సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఎంపీ పుట్టా మహేష్



**ఢిల్లీ/ఏలూరు,సూర్యబ్యూరో :** కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు భారత ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పరిధిలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నిధులు రాబట్టేందుకు శక్తి వంచన లేకుండా తనవంతుగా కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తనను సభ్యుడిగా నియమించిన ప్రధాన మంత్రినరేంద్రమోడీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ చైర్మన్ సిఆర్ పాటిల్, సహకరించిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటికే ఆయన ఇంధనం సహజవాయువు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తుండగా, తాజాగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీసభ్యుడిగా నియమించడం పట్ల ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## టిడిపిలో చేరండి ..
# రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

– 'దేశం' నేత కొవ్వలి రామ్మోహన నాయుడు



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని తీసుకొని రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు కోరారు. శనివారం ఆయన సూర్య ప్రతినిదితో మాట్లాడారు. 100 రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తికిరూ.10వేలు మట్టి ఖర్చులుగా అందజేయబడతా యన్నారు. సభ్యత్వం తీసుకున్న వ్యక్తికి రూ.5 లక్షల వరకు భీమా ఉంటుందని, కుటుంబ సభ్యులకు విద్యా,వైద్యం, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి క్రమంలో నడుస్తుందన్నారు. అభివృద్ధికి పాటుపడే తెలుగుదేశం పార్టీలో చేరి భవిష్యత్తును కాపాడుకోవాలని నాయుడు అన్నారు. తాను కూడాపార్టీ సభ్యత్వాన్ని పున రుద్ధరించుకున్నట్లు తెలిపారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన 5ఏళ్లలోఅమరావతిని

- తరువాయి 2లో..

## చదువు అంటే అక్షరాలు నేర్చుకోవడమే కాదు

- కంప్యూటర్ విజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయిలో అవగాహన అవసరం
- భారతీయ విద్యా భవన్‌కు త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి ప్రశంసలు




**భీమవరం,మేజర్‌న్యూస్ :** చదువు అంటే అక్షరాలు నేర్చుకోవడమే కాదని,అన్ని అంశాలను తెలుసుకోవాలని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంధ్రసేనారెడ్డి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండు రోజులు పర్యటన నిమిత్తం విచ్చేసిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ శనివారం భారతీయ విద్యాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత విద్యార్థులు బ్యాండ్‌తో స్వాగతం పలకగా,ఎన్.సి.సి క్యాడెట్లు మార్చిఫాస్టుతో గవర్నర్ ను వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం గవర్నర్ బాల సరస్వతి విగ్రహానికి పూలమాలవేసి,జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గవర్నర్ నల్లు ఇంధ్రసేనారెడ్డి మాట్లాడుతూ భారతీయ విద్యా భవన్ కుల మతాలకు అతీతంగా విద్యార్థులకు మంచివిద్యను అందించి భారతదేశ భావిపౌరులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో 40 సంవత్సరాలుగా విశేష కృషి చేస్తుందన్నారు. విద్యాసంస్థలను వివిధ పట్టణాల్లో విస్తరిస్తూ, ఫలితాలలో

- తరువాయి 2లో..

# 31న జరిగే ఏఐటియుసి సభను జయప్రదం చేయాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఆంధ్ర రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ చేయకుండా ఆపవలసిన బాధ్యత రాష్ట్ర ఎన్ డి ఏ ప్రభుత్వానికి ఉందని ఏఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే పేర్కొన్నారు.

అక్టోబర్ 31 గురువారం నాడు ఏఐటియుసి 105వ వ్యవస్థాపక దినోత్సవ గోడ పత్రికలను శనివారం నాడు ఆర్ఆర్ పేట ఎస్ ఆర్ టు వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 31వ తేదీ గురువారం ఉదయం 8:30 గంటలకు హెడ్ వాటర్ వర్క్స్ పంపుల చెరువు వద్ద ఏఐటియుసి వ్యవస్థాపక దినాన్ని జరుపుతున్నామని కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగ, సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ.అప్పలరాజు,వ్యవస్థాపకులు మాజీ కౌన్సిలర్ చిలుకూరి రమేష్ కుమార్ యూనియన్ కోశాధికారి బి నారాయణరావు యూనియన్ నాయకులు నారా. శ్రీనివాసరావు, ఎస్.ఎం.వి.సుబ్బారావు, డి.రవి, సిహెచ్. ఏసుబాబు, ఎస్. వంశీ, సిహెచ్. సతీష్, కనకరాజు, సిహెచ్. అప్పలరాజు, పి. ఎన్. జి. కుమార్, వంగపండు.శివ ఏ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నూతన ప్రిన్సిపల్‌గా వై శ్రీలత



కైకలూరు,మేజర్ న్యూస్, స్థానిక వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన ప్రిన్సిపాల్ గా డాక్టర్ వై శ్రీలత నియమితులయ్యారు. డాక్టర్ శ్రీలత గతంలో ఎస్ ఆర్ ఆర్,సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయవాడలో తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. కళాశాల విద్యాశాఖ ఇచ్చిన ప్రిన్సిపల్ ప్రమోషన్లలో పదోన్నతి పై ప్రిన్సిపాల్ గా నియమితులై కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు తమ విధులలో చేరారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది నూతనంగా నియమితులైన ప్రిన్సిపాల్ కి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ అందరి సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి. ఉదయ ప్రకాష్ మరియు అధ్యాపకులు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# 28 నుండి హెల్మెట్ వినియోగం పై ప్రత్యేక డ్రైవ్



జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో రవాణా , పోలీస్ అధికారులతో డీఎస్పీ రవి చంద్ర ,ఆర్టీఓ మధాని సమీక్ష నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ ,కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ కచ్చితంగా వినియోగించాల్సిందే అన్నారు. హెల్మెట్ నిభందనలు ఉల్లంఘిస్తే కచ్చితంగా రూ.1000 ఫైన్ తప్పదని,వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

# ప్రమాద వశాత్తు మృతి చెందిన భార్య,భర్త

మొదటిపేజి తరువాయి

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సంఘటన పట్ల తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విషయం తెలిసిన వెంటనే తమ వ్యక్తిగత సిబ్బందిని,ప్రభుత్వ యంత్రాంగాన్ని, పోలీస్ సిబ్బందిని పార్టీ నాయకులను సంఘటన స్థలానికి వెళ్ళి తక్షణమే సహాయక చర్యలు చేపట్టమని మంత్రి ఆదేశించారు. తన కార్యాలయం ప్రత్యేక అధికారి ప్రకాశరావు తో పాటు తెలుగు దేశం పార్టీ నాయుకులు,ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగడి కృష్ణ తదితరులను వెంటనే సంఘటన స్థలానికి పంపించి మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదవశత్తు మృతి చెందిన వారికి ప్రభుత్వం నుంచి అందే సహాయం త్వరగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.మరణించిన కొండారామారావు దంపతుల అంత్యక్రియల నిమిత్తం తక్షణమే తన స్వంత సొమ్ము 25వేల రూపాయలను మంత్రి కొలుసు పార్థసారధి బాధిత కుటుంబ సభ్యులకు తన వ్యక్తిగత సిబ్బందిచే అందజేశారు.

# డ్రోన్ పరికరాలతో దోమల నివారణకు స్ప్రేయింగ్



**ఏలూరు,మేజర్ న్యూస్:** దోమల కారణంగా నగర ప్రజలు అనారోగ్యం పాలు కాకూడదని ఉద్దేశంతో అధునాతన డ్రోన్ పరికరంతో స్ప్రేయింగ్ చేయించడం జరుగుతుందని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబుఅన్నారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కు నూతనంగా వచ్చిన డ్రోన్ పరికరాన్ని శనివారం ఉదయం స్థానిక 49వ డివిజన్ రామన్న కోనేరు ప్రాంతంలో మేయర్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు, కమిషనర్ భాను ప్రతాప్,నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్ పెదబాబు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను హరించే డెంగ్యూ,మలేరియా ఇతర సీజనల్ వ్యాధులకు కారణమైన దోమలను నివారించేందుకు. ప్రభుత్వం అధునాతన టెక్నాలజీ కలిగిన డ్రోన్ స్ప్రేయింగ్ మిషన్ ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పంపారన్నారు.

ఏలూరు నగరం పరిధిలో సుమారు130 నుండి 150 ఎకరాలు మనుషులు వెళ్లలేని ప్రాంతాలను గుర్తించామన్నారు ఆ ప్రాంతాల్లో డ్రోన్ స్ప్రేయింగ్ మిషన్ ఉపయోగించి స్ప్రేయింగ్ చేసి దోమలను నివారిస్తున్నామన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య ఆదేశాలతో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ తరపున పాలకవర్గం, కమిషనర్,ఇతర అధికారులు ప్రజల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధలు తీసుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య,డి.ఈ రజాక్,ఏ.ఈ సాయి,డి ఎం అండ్ హెచ్ ఓ కార్యాలయానికి సంబంధించినమలేరియా అధికారులు స్థానిక కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావు,జున్నూరు కనక నరసింహారావు, సబ్బన్న శ్రీనివాసరావు,నున్న కిషోర్,ఈదుపల్లిపవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో ఆంధ్రాకు ప్రథమ స్థానం

మొదటిపేజి తరువాయి

ఉందని, త్రిపురలో అక్షరాస్యత జనాభాలో 97శాతంగా ఉందన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ 11.93 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తులతో ఏలూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వ చేప పిల్లలాల ఉత్పత్తి కేంద్రాల ద్వారా చేప పిల్లలను పెంచి, చేపల, రొయ్యల చెరువులలో నిషిద్ధ యాంటీ బయోటిక్స్ వాడకుండా నాణ్యమైన చేపల మేతను సరఫరా చేసి నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులను సాదిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ కే.ఎస్.వి.నాగలింగాచార్యులు, ప్రముఖులు గారపాటి రామాంజనేయ చౌదరి (తపన చౌదరి), మాలతీ రాణి, ఎఫ్.డి.ఓలు కే.మంగారావు భార్గవి టి.రవి.వివిధ శాఖల అధికారులు, వివిఫ్ఏలువివిధపార్టీలనాయకులు, ప్రభృతులు పాల్గొన్నారు.

# టిడిపిలో చేరండి .. రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

మొదటిపేజి తరువాయి

అభివృద్ధి చేసేందుకు, రాష్ట్ర రాజధానిగా నిలిపేందుకు రు 15వేల కోట్లు ఖర్చు చేస్తే, అనంతరం అధికారంలోకి వచ్చినవైసిపి పార్టీ అభివృద్ధిని పక్కనపెట్టి రాష్ట్రానికి రాజధాని లేకుండాచేసిందన్నారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకు మూడు రాజధానులు అని చెప్పి ఒక్క ఇటుక కూడా వెయ్యలేదనిఅన్నారు.అమరావతిని రాజధాని చేసేందుకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో కృషి జరుగుతుంద న్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు, రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడే తెలుగుదేశం పార్టీలో సభ్యులుగా చేరి అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ప్రజలను నాయుడు కోరారు.

# చదువు అంటే అక్షరాలు నేర్చుకోవడమే కాదు

మొదటిపేజి తరువాయి

ఒకటి, రెండుస్థానాల్లో నిలుపుతూ రాష్ట్రంలో, అంతర్జాతీయ స్థాయిలోప్రఖ్యాతి గడించిందన్నారు. భీమవరంలో విద్యాసంస్థనునడిపిస్తున్నవిశ్వనాథరాజు,వారిఅధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా గవర్నర్ అభినందించారు. వచ్చే నెలలో త్రిపుర రాష్ట్రం అగర్తాలో భారతీయ స్కూల్ నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తుందని, దానికి నన్ను ఆహ్వానించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. విద్యను వ్యాపారంగా కాకుండా ఒక ట్రస్ట్ రూపంలో నడుపుతూ ఆదర్శంగా నిలుస్తుంద ‍న్నారు.భారతీయ విద్యా భవన్ మంచి వాతావరణంలో ఉండడం వలన విద్యార్థులు అనేక విషయాలను నేర్చుకోవడానికిఅవకాశం ఉందన్నారు. ప్రపంచం లోని పెద్ద పెద్ద కంపెనీలను భారతీయ సంతతి నాయకత్వం వహిస్తున్నారని, వారిలో తెలుగు వారు ప్రముఖంగా ఉండడం గర్వించదగిన విషయం అన్నారు.చదువు అంటే అక్షరాలు నేర్చుకోవడమే కాదని వివిధ యాక్టివిటీస్‌లో, సాంఘిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలన్నారు. ప్రతిదానిలో సైన్స్ కనిపిస్తుందని మన పరిసరాలను తీక్షణంగా మనం అర్థం చేసుకుంటూ సాగుతున్నట్లయితే సైన్స్‌తోపాటు,అన్ని సబ్జెక్టుల పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకోగలుగుతా మన్నారు. కంప్యూటర్ నేర్చుకున్నంత మాత్రాన ప్రయోజనం ఉండదని, ప్రతి విషయాన్ని క్షేత్రస్థాయిలో వాస్తవంగా తెలుసుకొని అప్పుడు కంప్యూటర్ అప్లికేషన్ చేయడం మంచి ఫలితాన్ని ఇస్తుందన్నారు.

మంచిగా చదువుకోవాలని, క్రీడలలో పాల్గొనాలని,ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని, తోటి వారికి సహాయం చేయాలని గవర్నర్ విద్యార్థులకు హితవు పలికారు. తొలుత భారతీయ విద్యా భవన్ విద్యార్థులచే నిర్వహించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభను కనపర్చి మెడల్స్ సాధించిన విద్యార్థులకు అవార్డులను గవర్నర్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. చివరిగా త్రిపుర రాష్ట్ర గవర్నర్ ను భారతీయ విద్యా భవన్ యాజమాన్యం శాలువా కప్పి సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, భారతీయ విద్యా భవన్ చైర్మన్ విశ్వనాథ్ రాజు,అచ్యుతరామరాజు, శ్రీనివాసరాజు, రామరాజు, ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల హక్కుల ప్రచారంలో ప్రతి ఒక్కరు కీలకపాత్ర పోషించాలి






**భీమవరం,మేజర్ న్యూస్:** చిన్నారుల హక్కుల గురించి తెలియ చెప్పడంలో ప్రతి ఒక్కరు కీలకపాత్ర పోషించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ చింతలపూడి తెలిపారు. శనివారం భీమవరం డిఎన్ఆర్ కాలేజీ సమావేశం హాలు నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,భీమవరం మండల సర్వీసెస్ ఆధ్వర్యంలో ది రైట్ అఫ్ ది చిల్డ్రన్ ఫర్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ నల్సా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ చింతలపూడి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ కం సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వై. యోహాన్ న్యూటన్, పోస్కో ఏడీజే సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ బాలలకు మంచి వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాలల వికాసం ఎంతో అవసరమని, ఆరోగ్యకరమైన వాతావరణంలో వారి సంరక్షణ ఉండాలన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ హోటల్స్, ఇటుక బట్టీలు, గృహాలలో బాల కార్మికులుగా ఎవరు ఉండకూడదన్నారు. బాలల చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోర్త్ ఏడిజె డి.సత్యవతి సత్యవతి,టెన్త్ ఏడిజె విజయదుర్గ,జ్యుడీషియల్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు,అడిషనల్ ఎస్పీ వి.భీమారావు,భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి,జిల్లా కార్మిక శాఖ అధికారి ఏ.లక్ష్మి, డిఎన్ఆర్ కళాశాలవైస్ ప్రెసిడెంట్ జి.పాండురంగరాజు, డిఎస్పిలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ క్యాంపు కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం

– ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ సోదరుడు పుట్టా రవి కుమార్



**ఏలూరు,మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపీ క్యాంపు కార్యాలయంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సోదరుడు పుట్టా రవి కుమార్ టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రూ.100లకు సాధారణ సభ్యత్వం, రూ. 1లక్ష కడితే వారికి శాశ్వత సభ్యత్వాన్ని తెలుగుదేశం పార్టీ అధిష్టానం కల్పించిందని తెలిపారు. 2024 సం,, నుండి 2026 సం,, వరకు రూ.100 సభ్యత్వంతో కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద భీమాతో పాటు కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం తెలుగుదేశం పార్టీ సాయం అందిస్తుందని రవికుమార్ స్పష్టం చేశారు. ఎంపీ క్యాంపు కార్యాలయానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజలు టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## గోవింద మాల దీక్ష ధరించిన 30 మంది స్వాములు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చిన్న వెంకన్న స్వామి వారి ఆలయంలో శనివారం ఉదయం మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన సుమారు 30 మంది గోవింద మాల దీక్ష ధరించారు.

40 రోజులపాటు ఉదయాన్నే లేచి సన్నిటి స్నానం చేసి పీఠంలో స్వామివారి పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి ఆలయానికి విచ్చేసి హారతి దర్శనం చేసుకుంటారు. సాయంత్రం పీఠంలో పూజా కార్యక్రమాలు భజనలు చేస్తారు.40 రోజులు దీక్ష అనంతరం గిరి ప్రదక్షిణ నిర్వహించి మాల విరమణ చేస్తామని గురుస్వామి తెలిపారు.

# తెలుగుదేశం పార్టీ సభ్యత్వ భీమా కార్యకర్తలకు ధీమా

– రాష్ట్ర టైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ భీమా కార్యకర్తలకు ధీమా రాష్ట్ర టైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బూసరాజు పల్లి గ్రామం వద్ద తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర టైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదు అనేది ఒక బృహత్తర కార్యమని, ఈరోజు నుండి ప్రారంభం అవుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.తెలుగుదేశం పార్టీలో సభ్యులుగా చేరడం ఒక వరంగా భావించాలని, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏర్పడినటువంటి తెలుగుదేశం పార్టీలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొని భాగస్వామ్యం కావాలని కేవలం 100 రూపాయలతో సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే 10వేల రూపాయల మట్టి ఖర్చులను, 5లక్షల బీమా సౌకర్యమును కల్పించిన ఏకైక రాజకీయపార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సోంబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు గద్దె అబ్బులు, మనెల్లి బాలు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని ఉపసంహరించాలి

– సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఎఫ్ పి పి సి ఎ చార్జీల పేరిట ప్రజలపై రూ.6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఎపి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నేడిచ్చిన ఉత్తర్వును వెంటనే ఉపసంహరించాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి నేడొక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ధరల పెరుగుదల, మరోవైపున ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇలా విద్యుత్ భారం మోపడం అమానుషమని అన్నారు. ఏనాడో వాడిన కరెంటుకు ఏళ్లు గడిచిపోయాక అదనంగా చార్జీలు చెల్లించాలన్న ఈ ఎఫ్ పి పి సి ఎ (ట్రూఅప్) విధానం మోసపూరితమైనదని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లోని దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైనదని అన్నారు. 2022-23లో వాడిన కరెంటుకు ఈ నవంబర్ నెల నుండి 2026 జనవరి వరకు కొన్ని నెలల్లో యూనిట్కు దాదాపు 83 పైసల వరకూ అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వులు ఉన్నాయని, ఇది విద్యుత్ వినియోగదార్లందరికీ కష్టమే కాదు, నిరుపేదలకు పెను భారం కూడా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారానికి వస్తే 'విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం', 'విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం' అని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలిచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతలా ఉంచి ఇప్పుడు అమాంతం 44 శాతం పెంపుదలకు పూనుకోవడం దారుణమన్నారు. విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం అవుతారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కొమ్ముచిక్కాలలో టిడిపి సభ్యత్వ నమోదు



**పోడూరు,మేజర్ న్యూస్ :** మండలంలో కొమ్ముచిక్కాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉదయం నుండి ప్రజలు స్వచ్ఛందంగా వారి సభ్యత్వాలను ఆన్లైన్ చేయించుకున్నారు,ఈ కార్యక్రమంలో పోడూరు మండల అధ్యక్షుడు గొట్టుముక్క సూర్యనారాయణరాజు, యూనిట్ ఇంచార్జ్ మేడిశెట్టి బుజ్జి కన్వీనర్లు గుంటూరు రాజా కొసన అబ్బులు కట్టా సత్యనారాయణ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మాధవాయిపాలెం ఫెర్రీ బకాయిదారు చెక్కులు అందజేత



నరసాపురంరూరల్,మేజర్ న్యూస్: మండల పరిషత్ కార్యాలయం నందు శనివారం జరిగిన మాధవాయపాలెం ఫెర్రీ జాయింట్ కమిటీ సమావేహము నందు గత పాటదారుడు బకాయి ఉన్న సొమ్ము రికవరీ విషయమై చర్చించి వెంటనే బకాయి ఉన్న సొమ్ము చెల్లించవలసినదిగా గత సంవత్సరం పాటదారుడు సి. హెచ్ యస్ వి రెడ్డప్ప ధవేజి ని ఆదేశించారు. తాను బకాయి ఉన్న సొమ్ము 3 నెలలలో పూర్తిగా చెల్లించగలవాడని తెలియజేస్తూ వాటికి సంబందించిన 3 పోస్ట్ పెయిడ్ చెక్కులు మధవాయిపాలెం ఫెర్రీ జాయింట్ కమిటీ సభ్యులకు అందజేసియున్నారు. కమిటీ సభ్యులుఈ విషయాన్ని అంగీకరించి జిల్లా ప్రజా పరిషత్ కు తెలియజేశారు.భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకొనవల్సినదిగా అధికారులను ఆదేశించియున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మైలబత్తుల సోనీ,ఎంపీడీవో జీవీఎస్ రామకృష్ణంరాజు రాజు, సూపరింటెండెంట్ వీరభద్ర రావు, సురేష్ జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

**– అధికారులకు జేసి రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం**



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తాడేపల్లి రైతు సేవ కేంద్రం వద్ద రైతు సేవ కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులతో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాడేపల్లిగూడెం మండలం పెద్ద తాడేపల్లిలో అక్టోబర్ 29న ప్రారంభించునున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయుటకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లర్ నుండి తీసుకువచ్చిన గన్ని బ్యాగులు, తేమశాతం కొలిచే పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. అధికారులు సిబ్బంది కలిసి సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు పక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి అంశాన్ని సిబ్బంది, సంబంధించిన అధికారులు క్షుణ్ణంగా తెలుసుకుని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వై.భవాని శంకరి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మురళీకృష్ణ, తాహసిల్దార్ ఎం.సునీల్ కుమార్, ఏవో, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈదరలో సభ్యత నమోదు ప్రారంభించిన టీడీపీ నాయకులు




**అగిరిపల్లి,మేజర్,న్యూస్:** మండల పరిధి ఈదర గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ నేతలు ,కార్యకర్తలతో కలిసి టిడిపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షులు చిట్నేని శివరామకృష్ణ మాట్లాడుతూ రూ.లక్ష కట్టిన వారికి శాశ్వత సభ్యత్వం రూ.100 సభ్యత్వ రుసుముతో రూ.5 లక్షల మేర బీమా సౌకర్యం,రూ.2 లక్షలుగా ఉన్న ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పేద మధ్య తరగతి వారి జీవన శైలి కుటుంబలో వ్యక్తినీ కోల్పోయిన వారి జీవన శైలిలో నిలదొక్కుకోవడం కోసం వారికి మంచి జరగాలన్న దృధ సంకల్పంతో ప్రారంభించిన ఈ సభ్యత్వ నమోదును విజయవంతంగా అందరూ వినియో గించుకోవాలని సూచించారు.

నూజివీడు నియోజకవర్గ టీడీపీ బిసి సెల్ అధ్యక్షులు అరేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అండగా నిలిచి ఒక గొప్ప ఆలోచనతోరాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్ర బాబు నాయుడు, వారి తనయుడు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి చనిపోయినరోజే అంత్యక్రియలకు రూ.10 వేలు కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దొడ్డంపాటి ఏసుపాదం,నక్కనబోయిన వేణు,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దోపిడి దొంగలు హల్చల్ బైక్ ఆపి చోరీ

**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** చిన్నాయగూడెం నుంచి భీమడోలు వెళ్లి మార్గంలో కప్పలగుంట సమీపంలో బైకుపై ఒంటరిగా వెళుతున్న శాంతి కుమార్ అనే వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు ఆపి కొట్టి తన వద్దనున్న బంగారపు ఉంగరము,సెల్ ఫోన్,నగదును దోచుకుని చెట్టుకు కట్టేసి పారిపోయారు. దీంతో బాధితుడు అక్కడ నుంచి తప్పించుకొని ద్వారకా తిరుమల పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## విద్యా ప్రవేశ్ 90 రోజుల కార్యక్రమంపై ఆకస్మిక తనిఖీ



పాలకొల్లు,మేజర్‌న్యూస్:స్థానిక జి.వి.ఎస్.వి.ఆర్.ఎం. మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు పశ్చిమ గోదావరి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాం సుందర్ విద్యాప్రవేష్ 90 రోజుల ప్రోగ్రాం ముగింపు కార్యక్రమానికి విచ్చేశారు.

ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించి.విద్యా ప్రవేశ్ కృత్యాలను పరిశీలించి. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా ఉపాధ్యాయులతో పాఠ్యాం శాలును పరిశీలించారు.

పాఠశాల ప్రాంగణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా. చురుకుతనంతో అన్ని రంగాల్లో పాల్గొంటున్నారని ప్రశంసించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీ ప్రసాద్ రాయపూడినీ. ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అభివృద్ధిలో పాలకొల్లు పట్టణంలోనే దాతల సహకారం ఈ స్కూల్ ఎంతో ఉందని. కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఏఎంఓ చంద్రశేఖర్. జిల్లా ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

# పపంచ కవితోత్సవంలో గురు శిష్యులకు 4 ప్రపంచ రికార్డులు

**పాలకొల్లు,మేజర్ న్యూస్ :** శ్రీశ్రీ కళావేదిక వారు నిర్వహించిన ప్రపంచ కవితోత్సవంలో మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, ఇద్దరు శిష్యురాండ్రు తమ ప్రతిభను కనబరిచి, నాలుగు ప్రపంచ రికార్డులలో పేరుని నమోదు చేసుకున్నారు. ఈనెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెంలో 24 గంటల 24 నిమిషాల 24 సెకండ్ల పాటు నాన్‌స్టాప్ ప్రపంచ సాహితి కళాజాతరలో పోడూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కవి,రచయిత కొల్లాబత్తుల సూర్య కుమార్ తెలుగు భాష ఔన్నత్యంపై కవితను ఆలపించగా, విద్యార్థులు రాపాక అమృత వర్షిణి, గుడాల టాబు శ్రీలక్ష్మి దేశభక్తి గీతానికి నృత్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డులు సాధించారు. ఈగురుశిష్యులను మండల విద్యా శాఖాధికారులు జి.విజయ కుమార్, జి.వి.సూర్యనారాయణ, కాంప్లెక్స్ చైర్మన్ కె.బేబీ విజయలక్ష్మి, సిఆర్‌పి మైలే శాంత కుమారి ఉపాధ్యాయుడు వీరవల్లి బాలాజీ, యస్ యం సి చైర్మన్ బొంతు వీరాంజనేయులు,యుటియఫ్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు దాసరి క్షేమ మూర్తి, కేతా నాగ రాజు,యస్ టి యు సంఘ



అధ్యక్ష కార్యదర్శులు కలిగితి దేవిడ్ రాజు, వాసంశెట్టి శ్రీనివాస రావు, యల్ ఎఫ్ యల్ ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్, గ్రామ సర్పంచ్ వడ్లపాటి రాజేంద్ర ప్రసాద్, యం.పి.టీ.సి వి.శారద, గ్రామ పెద్దలు శీలం శ్రీనివాసు, వడ్లపాటి మోహన రంగ అభినందించారు.

## ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఎం.వి.రమణ

**జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా భేటీ**



ఏలూరు/జంగారెడ్డి గూడెం, మేజర్‌న్యూస్: జంగారెడ్డిగూడెం డివిజన్ ఆర్డిఓగా నియమితులైన ఎంవి రమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారిని ఆర్డివో ఎంవి రమణ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జంగారెడ్డిగూడెం డివిజన్ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఎంవి రమణకు అభినందనలు తెలియజే శారు. మంగళగిరిలోని సిసిఎల్ఎలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేసిన ఎంవి రమణ జంగారెడ్డిగూడెం ఆర్డివోగా నియమితు లైనారు.

## కొనసాగుతున్న విజయవాడ వరద బాధితుల సహాయం

**– ఉండి మండల హైస్కూలు, ప్రైమరీ టీచర్ల విరాళం రూ.1,12,200**



**భీమవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నందు కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి డీఈవో చేతుల మీదుగా రూ.1,12,200 చెక్కును విజయవాడ వరద బాధితుల సహాయ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేయడం జరిగింది. చెక్కును అందజేసిన సందర్భంలో డిఇఓ నారాయణ, ఎంఈఓలో వి.వినాయకుడు, బి.జ్యోతి,ఎన్ఆర్‌పి అగ్రహారం హైస్కూల్ హెచ్ఎం ఎం.వి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## అన్ని వార్డులలో పారిశుద్ధ్య కార్యక్రమాలు

**– కమిషనర్ అంజయ్య**



**నర్సాపురం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోనిఅన్ని వార్డు లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టాలని అధికారులను మున్సిపల్ కమీషనర్ యం అంజయ్య ఆదేశించారు. శనివారం తెల్లవారు జామున స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా పలు వార్డులలో పర్యటించి డ్రైనేజీ సమస్యలను అడిగి తెలుసుకుని పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇంస్పెక్టర్. వేంద్ర ప్రసాద్,సానిటరి మేస్త్రి కిషోర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'దేశం' సభ్యత్వ నమోదు ప్రారంభించిన ఇన్చార్జ్ రామరాజు



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఒకటవ వార్డు లాకుపేటలో శనివారం తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదును ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజుప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపురం నియోజక వర్గంలో అత్యధికముగా సభ్యత్వాలు జరిగేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కొల్లు పెద్దిరాజు,జక్కం శ్రీమన్నారాయణ,కొప్పాడ రవీంద్ర ఠాగూర్,సంకు భాస్కర నాయుడు,గూడాల నాని,గూడాల సునీత,బూరచిన్నయమ్మ,పొన్నాల నాగబాబు,సత్యనారాయణ, ప్రసాద్,పెంద్ర శ్రీనివాస్,ఎండి మౌలాలి, ముస్కోడి రవి, మల్లాడి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఘన స్వాగతం





**– మత్స్యశాఖ ఏర్పాటు చేసిన ఆక్వా ఉత్పత్తుల స్టాల్ సందర్శన**

**ఉంగుటూరు,మేజర్ న్యూస్ :** త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంధ్రసేనారెడ్డి శనివారం ఉంగుటూరు మండలం గోపినాధ్ పట్టణంలో శ్రీ లక్ష్మీనారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ విశ్రాంతి భవనం వద్ద ఫిషరీస్ అధికారులు ఏర్పాటు చేసిన ఆక్వా ఉత్పత్తుల స్టాల్స్‌ను ఉంగుటూరు నియోజకవర్గం శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజుతో కలిసి సందర్శించారు. ఈ ప్రాంతంలో సాగుచేయుచున్న బొచ్చ, కొరమేను, శీలావతి, రూప్ చంద్, పంగాషియస్,రొయ్య,పీత తదితర మత్స్య ఉత్పత్తులకు సంబంధించిన వివిధ విభాగాలను పరిశీలించి వాటి సాగుచేసే విధానం అదే విధంగా ఆక్వా ల్యాబ్ ల ద్వారా పరిశీలిస్తున్న మట్టి,నీరు,మేత సంబంధించిన విషయాలను ల్యాబ్ టెక్నిషియన్ ను అడిగి తెలుసుకున్నారు. గవర్నరు స్వయంగా చేతితో చేపను తీసి పరిశీలించారు. అనంతరం శ్రీ లక్ష్మీనారాయణ ఛారిటబుల్‌ట్రస్ట్ విశ్రాంతి భవనాన్ని స్ధానిక శాసన సభ్యులతో కలిసి గవర్నరు సందర్శించారు. కార్యక్రమానికి ముందు ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, ఏలూరు జిల్లా ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ కె.ఎస్.వి. నాగలింగాచార్యులు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయచౌదరి, శరణాల మాలతీరాణి,తదితరులు గవర్నరు కు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. తదుపరి గవర్నర్ పోలీసు వందనాన్ని స్వీకరించారు.

## భీమడోలు మండలంలో 40వేల సభ్యత్వాల లక్ష్యం

**– జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు**





**భీమడోలు,మేజర్‌న్యూస్ :** మండలంలోని గుండుగొలనులో మండలపార్టీ అధ్యక్షులు శిరిబత్తిన వీరవెంకట సత్యన్నారాయణ అధ్వర్యంలో జరిగిన మండల తెలుగుదేశంపార్టీ సమావేశంలో సభ్యత్వ నమోదు ప్రారంభించిన జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు.ఈ సంధర్భంగా డిజిటల్‌గా నమోదు చేసిన సభ్యత్వాన్ని మండల పార్టీ అధ్యక్షులు కొండబాబుకి గన్ని అందజేశారు. ప్రతి తెలుగుదేశం కార్యకర్త 100 రూపాలయలు చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సభ్యత్వం ద్వారా 5 లక్షల ప్రమాద భీమా వర్తిస్తుందని అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి 40వేల సభ్యత్వాలు టార్గెట్‌గా పెట్టుకుని తదనుగుణంగా నాయకులు పని చేయాలన్నారు.ఈకార్యక్రమంలో కరణం పెద్దిరాజు,పట్నాల వెంకటేష్,బంటువిజయ్ కుమార్,దూసనపూడి పుల్లయ్యనాయుడు, సింగలూరి రామకృష్ణ,బొమ్మిడి అప్పారావు, ఇమ్మణి గంగాధర్,కడియాలరవిశంకర్,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిర్వాసితులకు తీరని అన్యాయం

**– సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య**



**వేలేరుపాడు,మేజర్‌న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు అర్హులైన నిర్వాసితుల జాబితాను బహిర్గతం చేయాలని సీపీఐ ఆద్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ జగన్నాధపురం గ్రామంలోని 140 మంది నిర్వాసితులను ఆర్ అండ్ ఆర్ జాబితా నుండి ఏ ప్రాతిపదికన తొలగించారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.దశాబ్దాల తరపడి ఏజెన్సీలో అన్ని ఆధారాలు కల్గి జీవనం కొనసాగిస్తున్న 140 మంది నిర్వాసితుల ఇళ్ల నష్టపరిహారం జాబితా నుండి తొలగించారని ఈ సమస్య పై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిర్వాసితులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. నిర్వాసితుల జాబితాలను బహిర్గతం చేసి వారికి అందించే ఆర్ అండ్ ఆర్ గురించి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇంటి నష్టపరిహారంలో నమోదైన జాబితాలో జరిగిన తప్పిదాలతో అనేక మంది నిర్వాసితులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్,జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నే పల్లి సాయి బాబు,సర్పంచ్ పిట్టా ప్రసాద్,మండల కార్యదర్శి బాడిస రాము,ఎర్రా మధు పాల్గొన్నారు.

# టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి



ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం ఉదయం గోపాలపురం నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో విజయవంతంగా జరిగింది. స్ధానిక శాసన సభ్యులు మద్దిపాటి వెంకటరాజు సహా పలువురు సభ్యత్వం తీసుకోవడం జరిగింది. పాత సభ్యత్వం ఉన్నవారు రెన్యువల్ కూడా చేసుకోవడం జరిగింది.

26వ తేదీ శనివారం నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుంది అని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈకార్యక్రమంలో ద్వారకా తిరుమల మండల పార్టీఅధ్యక్షులు లంకా సత్యనారాయణ, సీనియర్ నాయకులు కూచిపూడి ఉదయ భాస్కర్,గ్రామ అధ్యక్షులు నాయకులు,కార్యకర్తలు,పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# సభ్యత్వం రెన్యువల్ చేసుకున్న మాజీ ఎమ్మెల్యే బండారు



నర్సాపురం, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో భాగముగా మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు శనివారం రెన్యువల్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం చూసే ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు.

# డి.ఎన్.ఆర్ మహిళా కళాశాలలో పురుషుడి మృతదేహం





పాలకొల్లు,మేజర్‌న్యూస్: స్ధానిక శ్రీ దాసరి నారాయణరావు ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల నందు కుళ్ళిన మృతదేహం లభ్యమైంది, వివరాల్లోకెళితే కళాశాల ప్రాంగణంలో హాస్టల్ భవనం నందు దుర్వాసన రావడంతో అక్కడ పనిచేసే కార్మికుడు మృతదేహాన్ని గుర్తించాడు, దీంతో కళాశాల ప్రిన్సిపల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కేసు నమోదు చేసుకున్నారు, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ పి.ఉషావర్మ శవపంచినామా చేశారు, ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 రోజుల క్రితంమృతి చెంది ఉంటాడని,వయసు 60 సంవత్సరాలు ఉండవచ్చని చెప్పారు, ఎస్సై జి.పృద్వి మాట్లాడుతూ సమాచారం రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని , ఫోరెన్సిక్ చే వివరాలు సేకరిస్తామని చెప్పారు. కాలేజీ చుట్టూ ప్రహారి ఎవరు ఎక్కలేనంత ఎత్తు ఉంటుందని ఏ విధంగా మృతుడు ప్రవేశించాడు తెలియడం లేదని ప్రిన్సిపల్ తెలిపారు. రాత్రి సమయాల్లో వాచ్మెన్ ఉన్నప్పటికీ ఇది ఎలా జరిగిందో అర్ధం కావట్లేదని అన్నారు, వీఆర్వో సుబ్బారావు, ఎస్సై బాదం శ్రీనివాస్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పదవుల్లో జనసేనకి సముచిత స్ధానం కల్పించాలి



పెదవేగి,మేజర్ న్యూస్ : దెందులూరు నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ,కొన్ని డైరెక్టర్ పదవులు జనసేన పార్టీకి కేటాయించమని,అన్ని నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీకి సముచిత స్ధానం కల్పించమని కోరుతూ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసేన నాయకులు,కార్యకర్తలు ,కూటమి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందించడం జరిగింది.ఈ సందర్భంగా వెంకటలక్ష్మి ఈ విషయంపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో మాట్లాడుతూ 2024 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా దెందులూరు నియోజకవర్గంలో పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలుపొందడంలో నియోజకవర్గంలోని జనసేన పార్టీ సహాయ,సహకారం ఎంతో ఉందని మీరు అనేక సందర్భాల్లో,అనేక సమావేశాల్లో కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేసినందుకు జనసేన పార్టీ తరఫున మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, అన్నారు. త్వరలో నియామకం జరగబోవు దెందులూరు నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి,కొన్ని డైరెక్టర్ పదవులు జనసేన పార్టీకి కేటాయించమని హాస్పటల్ అభివృద్ధి కమిటీల్లో,ఆలయ కమిటీల్లో,సహకార బ్యాంకు కమిటీల్లో, నీటి సంఘాల్లో,మిగిలిన అన్ని కమిటీల్లో,నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీకి సముచిత స్ధానాన్ని కల్పించమని కోరుతున్నామని అన్నారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి ముత్యాల రాజేష్,పెదవేగి మండల జనసేన నాయకులు పసుపులేటి భార్గవ్,జిజ్జువరపు సురేష్ ,పెదపాడు మండల జనసేన నాయకులు గరికపాటి చంటి,దెందులూరు మండలం జనసేన నాయకులు పెద్ది శెట్టి నాని,జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ : మేయర్



ఏలూరు,మేజర్ న్యూస్: తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతి ఒక్క హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిబ్బంది. ప్రైవేట్ సెప్టిక్ ట్యాంక్ సిబ్బందికి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని శనివారం ఉదయం మేయర్ చాంబర్లో పిపిఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ పెదబాబు, కమిషనర్ భాను ప్రతాప్ మాట్లాడుతూ.ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య ఆదేశాలతో కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిబ్బంది.ప్రైవేట్ సెప్టిక్ ట్యాంక్ సిబ్బంది 62 మందికి స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ద్వారా వచ్చిన పిపి ఈకిట్లను ఈరోజు అందజేశామన్నారు.ఈ కిట్లలో చేతి గ్లౌజులు,ఫుల్ షూట్ డ్రెస్సు, గంషూ,హెల్మెట్,గ్యాస్ మాస్క్,కళ్లద్దాలు మొదలగునవి ఉంటాయన్నారు.వీరు చేసే పనులు ద్వారా వీరి ఆరోగ్యం శుభ్రంగా ఉండాలని ఆరోగ్య భద్రత కోసం వారి ఒంటికి మలినాలు అంటకుండా ఉండాలని,డ్రైనేజీల ద్వారా వెదజల్లే విషవాయువు నుండి రక్షణగాపిపిఈ కిట్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య,డి.ఈ రజాక్,ఏ.ఈ సాయి, కార్పొరేటర్లు దేవరకొండ శ్రీనివాసరావు,జున్నూరు కనకనరసింహారావు,సబ్బన్న శ్రీనివాసరావు,జజ్జవరపు విజయనిర్మల,నున్న కిషోర్,ఈదుపల్లిపవన్,కో-ఆప్షన్ సభ్యులు కొల్లేపల్లి రాజు,జాల సుమతి బాలాజీ పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వం 60 లక్షల మంది కుటుంబ సభ్యులకు కవచం

- భీమవరం నియోజకవర్గ పరిశీలకులు దాసరి ఆంజనేయులు



భీమవరం,మేజర్న్యూస్: తెదేపా జాతీయ అధ్యక్షులు,ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, పొలిట్ బ్యూరో సభ్యురాలు,నియోజకవర్గం ఇంచార్జి తోట సీతా రామలక్ష్మి సారధ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది.భీమవరం నియోజకవర్గం రూరల్ మండలం దిరుసుమర్రు గ్రామంలోమండల అధ్యక్ష, కార్యదర్శులు రేవు వెంకన్న,కౌరు పృధ్వి శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఏండ్ర శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షులు రాజబాబు,బిసిసెల్ జిల్లాఉపాఅధ్యక్షులు సోమేశ్వరావు సీనియర్ నాయకులు కోళ్ల సీతారాం,నాగబాబు గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమనానికీ ముఖ్య అతిధిగానియోజకవర్గ పరిశీలుకులు దాసరి ఆంజనేయులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ సభ్యులకి సభ్యత్వం కవచం అని 60 లక్షల మంది కుటుంబంలో సభ్యనిగా ఉండీ ప్రమాదంలో చనిపోతే రూ.5లక్షలు భీమా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు.సంఘటన అనంతరం బొక్కావారిపాలెంలో పట్టణాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు,క్లస్టర్ ఇంచార్జి,వార్డునాయకులు,కార్యకర్తలు నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యమాన్ని దాసరి ఆంజనేయులు పర్యవేక్షించారు.

## విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

ఏలూరు,మేజర్ న్యూస్: ఏఎఫ్పిపిసిఎ చార్జీల పేరిట ప్రజలపైరూ 6072 కోట్లు భారాన్ని విధిస్తూ ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు కో కన్వీనర్ ఆగోల్ల వెంకట కృష్ణారావులు నేడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి ఆదిశేషు మాట్లాడుతూ ఇప్పటికే ధరలు పెరుగుదల ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఎలా విద్యుత్తు భారం మోపటం అమావాస్యమని వారు తెలిపారు

వాడిన కరెంటుకు ఏళ్లు గడిచిపోయాక అదనంగా చార్జీలు చెల్లించాలన్న ఎఫ్పిపిసిఎ విధానం మోసపూరితమైందని తెలిపారు ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్య సంస్థలో నిర్మాణగమైన షరతుల్లో ఇది ముఖ్యమైందని వారు పేర్కొన్నారు 2022-23లో వాడిన కరెంటుకు ఈ నవంబర్ నెల నుండి 20 26 జనవరి వరకు కొన్ని నెలల్లో యూనిట్కు దాదాపు రూ 0.83 పైసలు అదనంగా చెల్లించాలని తాజా ఉత్తర్వు ఇచ్చిందని ఇది విద్యుత్తు వినియోగదారులకు కష్టమని పేదలకు పెను భారం అని వారు పేర్కొన్నారు.

మాట తప్పి ప్రజలపై భారాన్ని వేసిన క్రూ ఆఫ్ చార్జీల భారాన్ని వెంటనే రద్దు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసించాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

# టీడీపీ సభ్యత్వ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

- ఎమ్మెల్యే బడేటి చంటి,మేయర్ షేక్ నూర్జహాన్




ఏలూరు,మేజర్ న్యూస్: స్థానిక 50వ డివిజన్లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పాల్గొని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ కార్యకర్తగా సభ్యత్వాన్ని నమోదు చేసుకున్న పలువురికి సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే బడేటి మాట్లాడుతూ... టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరుగుతోందన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకుంటే కార్యకర్తకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. భీమా సౌకర్యం, వైద్యంలో రాయితీ, విద్యార్ధులకు ఫీజులు, నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇలా ఎన్నో ప్రయోజనాలు అందుతాయన్నారు. కేవలం వంద రూపాయలతో సభ్యత్వం పొంది ఎన్నో ప్రయోజనాలు పొందొచ్చన్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరిని టీడీపీ సభ్యునిగా చేర్చాలని పార్టీశ్రేణులకు సూచించారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి నిదర్శనమే తెలుగుదేశం పార్టీయని అన్నారు.

కార్యకర్తలే టీడీపీకి వెన్నెముకలని, కార్యకర్తల భవిష్యత్ కోసం టీడీపీ ఎంతో కృషిచేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నగరపార్టీ అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్,నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు,క్లస్టర్ ఇంచార్జ్ అమరావతి అశోక్,రెడ్డి నాగరాజు, టీడీపీ డివిజన్ ఇంచార్జ్ మంత్రి మహాలక్ష్మినాయుడు, టిడిపినాయకులు ఎంఆర్డి బలరాం,మంచేం మైబాబు, బొద్దాని శ్రీనివాస్, యార్లగడ్డ సత్తిబాబు, పాటూరి త్రినాథ్, డివిజన్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐటీడీఏ ప్రత్యేక డిఎస్సి ఏర్పాటు చేయాలి



వేలేరుపాడు,మేజర్న్యూస్ : 5వ షెడ్యూల్ ప్రాంతాలలో ఐటీడీఏ ద్వారా ప్రత్యేక డీయస్సిని ఏర్పాటు చేయాలని శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్,ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేసి ఉపాధ్యాయ భర్తీలు నిర్వహించాలని కోరారు. మైదాన ప్రాంతం,5వ షెడ్యూల్డు ప్రాంతాలను కలిపి ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయరాదని వినతిలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పొట్ల మోహన్ దొర,సోడే సీతా రామయ్య,సోడే కళ్యాణ్ బాబు, నవీన్, రాము, లక్ష్మి, ముత్యాల రావు,మేఘ్న,పాల్గొన్నారు.

## నిత్య అన్నదాన ట్రస్ట్కు రూ.13 లక్షలు విరాళాలు







ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: చిన్న వెంకన్న ఆలయ ఒకుళ మాత నిత్య అన్నదాన ట్రస్ట్ కు వేరువేరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రూ12లక్షల 1వేయి 252లు విరాళాలను అందించారు. కృష్ణాజిల్లా మొవ్వ మండలం పెదపూడి గ్రామానికి చెందిన వేములపల్లి వేంకట రామదాసు సరోజినీ దంపతులు శాశ్వత అన్నదాన పథకానికి 9 లక్షలు విరాళాన్ని అందించారు. హైదరాబాద్ నగరానికి చెందిన కంచర్ల మంగారావు జానకి దంపతులు జానకి రామయ్య పేరున రూ1లక్ష 116లు విరాళాన్ని అందించారు. గోల నాగేశ్వరరావు రూ.1 లక్ష విరాళాన్ని అందించారు. శ్రీపాద లక్ష్మీ నరసింహ మూర్తి రూ.1లక్ష 1వేయి116లు విరాళాన్ని అందించారు. వారికి దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎన్విఎస్ఎన్ మూర్తి,ఏ ఈ ఓ నటరాజ్, సూపర్డెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం, రమణ రాజు, దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి బాండ్ పత్రాలను, స్వామివారి ప్రసాదాలను, అందించి అభినందనలు తెలిపారు.

## గ్రామ సభల ద్వారా 246 దరఖాస్తులు స్వీకరణ - తాసిల్దార్



నర్సాపురంరూరల్, మేజర్ న్యూస్ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన రీసర్వే గ్రామ సభలు విజయవంతం అయ్యాయని తాసిల్దార్ రాజ రాజేశ్వరి తెలిపారు. శనివారం ఆమె సూర్య ప్రతినిధితో మాట్లాడారు. ఈనెల 18 నుండి25 వరకుగొంది, చిట్టవరం, చిన మామిడిపల్లి, సరిపల్లి, లికితపూడి, సీతారాంపురం,కే బేతపూడి గ్రామాల్లో రెవిన్యూ టీం సభలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సభలలో అనేక మంది రైతులు పాల్గొని తమ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలు అందజేశారన్నారు.

ఈ సందర్భంగా246 దరఖాస్తులు స్వీకరించినట్లు, వాటిపై విచారణ ప్రారంభిస్తామన్నారు. రైతుల నుండి వచ్చిన అనేక రకాల ఫిర్యాదులపై లోతుగా దర్యాప్తు చేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రిసర్వే పూర్తికాని చిన మామిడిపల్లిలో సుమారు 800 ఎకరాలు ఆన్లైన్లో చూపించడం లేదని,ఈ సమస్య పరిష్కారానికిజిల్లా ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఉమ్మడి ఆస్తులను ప్రక్షాళన కోసం దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని, సరిహద్దులు తదితర సమస్యలను పరిష్కరించాల్సిందిగా సభలలో భూయజమానులు దరఖాస్తులు అందజేసినట్టు తాసిల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు.

# ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని వినియోగించుకోవాలి

**- జనసేన ఇంచార్జ్ రెడ్డి అప్పన్నాయుడు**




**ఏలూరు,మేజర్ న్యూస్:** ఈ దీపావళి నుండి కూటమి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేయనున్నారని దీన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని రెడ్డి అప్పలనాయుడు కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గరి నుండి ప్రజలకు అనేక రకాల రూపంలో సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలకు మరింత చేరువలో ఉండాలని సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నారని ఆయన తెలిపారు. అందులో భాగంగానే ఈ దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలుచేయనున్నారని, దీనిని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, ఈ రాష్ట్ర ప్రజానీకం మీద ప్రత్యేకంగా మహిళ పట్ల వారికున్న అంకితభావం, దాంట్లో భాగంగానే జనసేన పార్టీ ముఖ్య అజెండాలో ఉన్న ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయడం.. జనసేన పార్టీ సిద్ధాంతాల్లో సంవత్సరానికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని తెలిపారు. ఇది పవన్ కళ్యాణ్ వారి అభిమతం. కూటమి ప్రభుత్వంలో దీన్నే ఒక ప్రణాళికగా ఎలక్షన్ హామీలో భాగంగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు,చిన్నచితక సన్నకారు రైతులకు కూడా పెన్షన్లు ఇవ్వాలని, అదికూడా త్వరలోనే కార్యరూపం దాల్చుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశినరేష్, ఉపాధ్యక్షులు సుందరనీడి వెంకట దుర్గా ప్రసాద్, మండల అధ్యక్షులు వీరంకి పండు, ప్రోగ్రాం కమిటీ అధ్యక్షులు రెడ్డి గౌరీ శంకర్, ప్రధాన కార్యదర్శి కావూరి వాణిశ్రీ, కార్యదర్శి ఎట్రించి ధర్మేంద్ర, మీడియా ఇంచార్జీ జనసేన రవి తదితరులు పాల్గొన్నారు.

# త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్, ఎస్పీ





**భీమవరం,మేజర్ న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో పలు కార్యక్రమాలు పాల్గొనేందుకు విచ్చేసిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంధ్రసేనారెడ్డి కి ఘన స్వాగతం లభించింది.త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంధ్రసేనారెడ్డి పశ్చిమ గోదావరి జిల్లాలో శని,అదివారాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తొలుత శనివారం భారతి విద్యా భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు.

తదుపరి గవర్నర్ పోలీసు వందనాన్ని స్వీకరించారు. గవర్నర్ వెంట ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు, భారతీయ విద్యా భవన్ చైర్మన్ విశ్వనాథరాజు, అచ్యుతరామరాజు, శ్రీనివాసరాజు,తదితరులు ఉన్నారు.

## టిడిపి సభ్యత్వాలు మండలంలో భారీగా నమోదు చేయాలి



**టి.నర్సాపురం,మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టి.నరసాపు మండలం తిరుమలదేవిపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు,రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శీలం వెంకటేశ్వరావు మాట్లాడుతూ సభ్యత నమోదు కార్యక్రమాన్ని మండలంలో భారీగా నమోదు చేయాలని మండలంలోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు పిలుపు ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ తెలుగుదేశం పార్టీఅధ్యక్షులు పారెపల్లి బాబులు ,కాల్నిడి వెంకటరత్నం, పండు ,తోట శ్రీను, మన్యం దుర్గారావు, ప్రభాకర్,కాసగాని వీరాజు,నాగు, పండు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారానికి కృషి



**- అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టర్ క్యాంపుకార్యాలయం నుండి నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పెండింగ్ కోర్టు కేసులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోని వివిధశాఖలలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి పరిష్కారానికి ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖలకు సంబంధించి టైమ్ బాండ్ కేసులు, డైరెక్షన్స్, ధిక్కార, రిట్ ఫిటీషన్స్ లపై ఆయా శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు.రిట్‌పిటీషన్లపై సరైన కౌంటర్లు ఫైల్ చేయాలన్నారు. ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు.కేసుల పరిష్కారంపై వారం వారం సమీక్షిస్తామన్నారు. తదుపరి చర్యలకోసం ఆయా కేసులకు సంబంధించి వచ్చిన జడ్జిమెంట్లు తీసుకున్న చర్యలతో కూడిన నివేదికను సంబంధిత డాక్యుమెంట్లతో మంగళవారం హాజరుకావాలన్నారు. లోకాయుక్త, జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్,హై కోర్టు, తదితర కోర్టుల అందిన కేసులపై జిల్లా అధికారులు, ఆర్డీఓ లు, తహసీల్దార్లు తో సమగ్రంగా కలెక్టర్ సమీక్షించారు. సంబంధిత కేసులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.రిట్ పీటీషన్స్‌లో కోర్టులు ఇచ్చిన ఆదేశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ నమోదు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి పరిస్థితి రాకుండా అధికారులు ముందుగానే తీసుకున్నచర్యలపై నివేదికను సదరు కోర్టుకు సమర్పించాలన్నారు. కోర్టు ధిక్కరణ కేసుల్లో ఎటువంటి జాప్యం లేకుండా వకాల్తా సమర్పించాలన్నారు.జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, ఆర్డీఓలు అచ్యుత అంబరీష్, బి.వాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు,తహసీల్దార్లు, జూమ్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఆహ్వానం పలికిన ఏఎస్పి



ఉంగుటూరు, మేజర్ న్యూస్: త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి ఏలూరు జిల్లా పర్యటన నేపథ్యంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పి అడ్మిన్ నక్కా సూర్యచంద్రరావు గవర్నర్‌కి పుష్పగుచ్చం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు.గవర్నర్ ఉంగుటూరు మండలంలో పలు ప్రదేశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో పాల్గొని తిరిగి పశ్చిమగోదావరి జిల్లా చేరుకున్నారు.

## పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్



చింతలపూడి,మేజర్‌న్యూస్: చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో టీడీపిపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్.మాజీ నియోజకవర్గ కన్వీనర్ జగ్గవరపు.ముత్తారెడ్డిఈ కార్యక్రమంలో, మండల పార్టీ అధ్యక్షులు మాటూరి. వెంకటరామయ్య, సీనియర్ నాయకులు. సూరనేని. గోపీనాథ్, గ్రామ కమిటీ అధ్యక్షులు. తాళ్లూరి. చంద్రశేఖర్ రెడ్డి,ఎక్స్ ఎంపిటిసి, కనమతరెడ్డి.రాజారెడ్డి తదితరు నాయకులు పాల్గొన్నారు.

## భూసేకరణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**- వివిధ శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్**



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకోసం భూసేకరణకు సంబంధించి సమగ్ర సమాచారంతో కూడిన నివేదికలను అందజేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా భూ సేకరణకు సంబంధించి జిల్లా, డివిజన్, మండలస్థాయి, అధికారులతో సమీక్షా సమావేశం కలెక్టర్ కె.వెట్రిసెల్వి నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎపిఐఐసి కు సంబంధించిన భూములు,ద్వారకాతిరుమలలో సోలార్ ప్రాజెక్ట్,నాయీ బ్రాహ్మణ భవనం, కైకలూరులో డంపింగ్ యార్డ్ కోసం భూ సేకరణ, జీలుగుమిల్లి మండలంలో నౌకాదళ విభాగానికి భూ సేకరణ, నూజివీడు నుంచి సుంకొల్లు రింగ్ రోడ్డుకోసం,జాతీయ రహదారుల కోసం భూ సేకరణ,కోర్టు కేసులు, బిఎస్ఎన్ఎల్ స్ట్రెక్చర్ కు సంబంధించిన భూములకు సంబంధించిన అంశాలు, మోడల్ పార్క్ కు సంబంధించిన భూసేకరణ,ఏలూరు జెడి ఫిషరీష్‌కు సంబంధించిన ప్రభుత్వ భూములు కేటాయించడం, పరిశ్రమల శాఖ భూమి కేటాయింపు, తదితర ప్రభుత్వ భూములకు సంబంధించిన విషయాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించిన సమగ్ర సమాచారంతో నివేదికలను త్వరితగతిన అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజరు కె.బాజ్జి, జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారులు, మత్స్యశాఖ, పరిశ్రమల శాఖ, మండల తహశీల్దార్లు, గృహనిర్మాణ శాఖ, నేషనల్ హైవే, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.